బదిలీ అయిన ఎస్‌జీటీలను రిలీవ్ చేయాలి

● టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి

భువనగిరి అర్బన్, జూలై 21 : విద్యా వలంటీర్లను నియమించి బదిలీ అయిన ఎస్‌జీటీలను వెంటనే రిలీవ్ చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.రాజశేఖర్ రెడ్డి అన్నారు. పట్టణంలోని సంఘం కార్యాలయంలో ఆదివారం జరిగిన జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాథమిక పాఠశాల హెచ్ఎం పోస్టులు పదివేలకు పెంచి బీఈడీ అర్హత కలిగిన ఎస్‌జీటీలకు పదోన్నతి అవకాశం కల్పించాలన్నారు. పదోన్నతుల్లో లెస్ట్ ఓవర్ కారణంగా మిగిలిన ఖాళీల్లో అర్హతలు గల ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించాలని కోరారు. అంగన్‌వాడీల్లో మూడో తరగతి వరకు నిర్వహించాలనే ఆలోచన విరమించుకోవాలన్నారు. ప్రీ ప్రైమరీ తరగతులను ప్రాథమిక పాఠశాలలోనే ప్రారంభించాలని, మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న 4డీఏలు విడుదల చేయాలని, సాధ్యమైనంత త్వరలో పీఆర్‌సీ ప్రకటించాలని అన్నారు. జిల్లాలో వర్క్ అడ్జెస్ట్‌మెంట్ పేరుతో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న డిప్యుటేషన్‌ను రద్దు చేయాలని కోరారు. 317 జీఓ బాధితుల సమస్యలు పరిష్కరించాలన్నారు. మరుగుదొడ్ల నిర్వహణ లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అన్ని పాఠశాలలకు పారిశుధ్య కార్మికులను, నైట్ వాచ్‌మన్‌లను, నాలుగో తరగతి ఉద్యోగులను వెంటనే నియమించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న జీపీఎఫ్, మెడికల్, బీమా, సరెండర్ లీవ్ బిల్లులు, ఉద్యోగ విరమణ చేసిన వారి బెన్‌ఫిట్స్ బిల్లులన్నింటినీ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెతుకు సైదులు, రాష్ట్ర కమిటీ సభ్యుడు ముక్కెర్ల యాదయ్య, జిల్లా కార్యదర్శులు పి.వెంకట్ రెడ్డి, పి.సుధర్మారెడ్డి, కె.రవికుమార్, నాయకులు జీవీ రమణారావు, జె.కరుణాకర్, పి.సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

జిల్లా శిక్షణా తరగతులను జయప్రదం చేయాలి

● సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం

శిక్షణా తరగతుల కరపత్రం ఆవిష్కరిస్తున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం, నాయకులు

యాదగిరిగుట్ట, జూలై 21 : రామన్నపేటలో ఈ నెల 27, 28 తేదీల్లో నిర్వహించే సీఐటీయూ జిల్లా శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం పిలుపునిచ్చారు. యాదగిరిగుట్టలో ఆదివారం శిక్షణా తరగతుల కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలు, కార్మికుల హక్కులను తెలియజేసేందుకు తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. దేశంలో నరేంద్ర మోదీ మూడోసారి అధికారంలోకి వచ్చిన వెంటనే సహజ వనరులైన బొగ్గు బావుల ప్రైవేటీకరణకు పూనుకున్నదని విమర్శించారు. మోదీ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా జిల్లా, మండల, పారిశ్రామిక కేంద్రాల్లో నిరసనలు, ధర్నాలతో డిమాండ్ డే నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని సింగరేణి బొగ్గు గనులను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు వేలం వేస్తున్నారని తెలిపారు. కార్మికులకు నష్టం చేసే లేబర్ కోడ్‌లను రద్దు చేసి, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పుప్పాల గణేశ్, సుక్క పెద్ద వెంకటయ్య, నగేశ్, అనిల్, సిద్ధయ్య పాల్గొన్నారు.

గీత కార్మికులకు ఉచితంగా సేఫ్టీ మోకులు ఇవ్వాలి

● కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయరాములు

మండల మహాసభలో మాట్లాడుతున్న కేజీకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయరాములు

రామన్నపేట, జూలై 21 : గీత కార్మికులందరికీ ప్రభుత్వం ఉచితంగా సేఫ్టీ మోకులు ఇవ్వాలని కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.జయరాములు అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం జరిగిన సంఘం మండల మహాసభలో ఆయన మాట్లాడారు. గీత కార్మిక వృత్తి అత్యంత ప్రమాదకరమని తెలిసినా గత్యంతరం లేని పరిస్థితిలో వృత్తిని కొనసాగించాల్సి వస్తున్నదన్నారు. ఏడాది లోనే రాష్ట్రంలో 520 మంది, జిల్లాలో 80మంది గీత కార్మికులు ప్రమాదానికి గురయ్యారని తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రాగీరు కిష్టయ్య మాట్లాడుతూ ప్రమాదవశాత్తు చెట్టు పైనుంచి పడి మృతిచెందిన గీత కార్మికులకు, శాశ్వతంగా అంగ వైకల్యం కలిగిన వారికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎర్ర రవీందర్ అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో జిల్లా ఉపాధ్యక్షుడు బావండ్ల పల్లి బాలరాజు, నాయకులు పులి భిక్షం, కూనూరు మల్లేశం, మునుకుంట్ల లెనిన్, బైరు రామకృష్ణ, పబ్బు గంగాధర్, వెంకన్న, నవీన్, సత్యనారాయణ పాల్గొన్నారు.

సిద్ధగురువు దర్శనం.. సమస్త నదుల సందర్శనం

● సిద్ధగురు రమణానంద మహర్షి

రమణేశ్వరంలో గురుపౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న భక్తులు

భువనగిరి కలెక్టరేట్, జూలై 21 : సిద్ధగురువుల దర్శనం సమస్త నదుల సందర్శనంతో సమానమని సిద్ధగురు రమణానంద మహర్షి పేర్కొన్నారు. గురుపౌర్ణమిని పురస్కరించుకుని మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామ సమీపంలోని శివశక్తి అనుగ్రహ మహాపీఠం రమణేశ్వరంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గురువులను మించిన దైవం లేదని, గురువు మాటకు కట్టుబడి నిలబడేవాడే నిజమైన శిష్యుడని అన్నారు. లోకంలో గురుశిష్యుల బంధం ఎంతో గొప్పదని, ఆ బంధానికి వెలకట్టలేమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రమణేశ్వరంలోని బంగారు శివలింగం, స్థిరలింగం, ఆదిపరాశక్తి, షిరిడీసాయినాథుడు, పార్వతీపరమేశ్వరుల విగ్రహాలకు విశేష ద్రవ్యాలతో అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాద వితరణ చేపట్టి భక్తులకు అన్నదానం చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఆత్మీయ సమ్మేళనంలో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

రామన్నపేట, జూలై 21 : మండలంలోని బోగారం ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన 2002-03 విద్యా సంవత్సరానికి చెందిన ఏడో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకొన్నారు. ఈ సందర్భంగా చిన్ననాటి స్నేహితులు ఒకరినొకరు ఆలింగనం చేసుకొని నిక్ నేమ్‌లతో ఆప్యాయంగా పలుకరించుకున్నారు. తమకు పాఠాలు చెప్పిన గురువులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.

కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, శ్రీరాములు, మంజుల, పద్మ, మమత, వెంకన్న, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్టకు తగ్గిన భక్తుల రద్దీ

కొండపైన భక్తులు

యాదగిరిగుట్ట, జూలై 21 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి భక్తుల రద్దీ తగ్గింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దగా రాకపోవడంతో ఆలయ పరిసరాలు వెలవెలబోయాయి. సెలవు దినాల్లో భక్తుల సందడితో రద్దీగా ఉండే ఆలయ పరిసరాలు ఆదివారం బోసిపోయినట్లు కనిపించాయి. కొందరు భక్తులు వర్షంలో తడుస్తూనే నారసింహస్వామిని దర్శించుకున్నారు. రద్దీ తక్కువగా ఉండటంతో అర గంటలోనే స్వామివారిని దర్శించుకుని భక్తులు వెనుతిరిగారు. స్వయంభువుగా వెలిసిన నారసింహుడి నిత్యోత్సవాలు అత్యంత వైభవంగా సాగాయి. సుప్రభాతం నుంచి పవళింపు సేవ వరకు స్వామి, అమ్మవార్ల నిత్య కైంకర్యాలు పాంచరాత్రగమశాస్త్రం ప్రకారం జరిగాయి. ఆదివారం తెల్లవారుజామున స్వామివారికి సుప్రభాత సేవ నిర్వహించారు. తిరువారాధన నిర్వహించి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వామివారికి నిజాభిషేకం, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టారు. ఉదయం ఆలయం వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ సుదర్శన నారసింహ హవనం జరిపారు. మొదటి ప్రాకార మండపంలో స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా అలంకరించి గజ వాహన సేవ చేపట్టారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా సాగింది. భక్తులు స్వామి వారి కల్యాణాన్ని వీక్షించారు. ఆలయ ముఖ మండపంలో సువర్ణమూర్తులకు పలు దఫాలుగా సువర్ణ పుష్పార్చన కార్యక్రమాలు సాగాయి. సాయంత్రం స్వామివారికి వెండి మొక్కుజోడు సేవ, దర్బార్ సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. రాత్రి స్వామివారికి తిరువారాధన, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన జరిపారు. రాత్రి ప్రధానాలయం ముఖ మండపంలో ప్రతిష్ఠామూర్తులకు తిరువారాధన, సహస్రనామార్చన జరిగాయి.

స్వామివారిని సుమారు 10వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ. 25,23,042 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

కాలకంఠ శతక పుస్తకావిష్కరణ

కాలకంఠ శతక పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

భూదాన్ పోచంపల్లి, జూలై 21 : పట్టణంలోని సత్సంగ జ్ఞాన మందిరంలో జాతీయ తెలుగు సాహితీ పీఠం హైదరాబాద్ ఆధ్వర్యంలో వడ్డేపల్లి రాజేశ్వర్ రచించిన కాలకంఠ పుస్తకాన్ని అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికుడైన ప్రముఖ కవి వడ్డేపల్లి రాజేశ్వర్ పద్యాలు రాసి పుస్తకంగా తీసుకురావడం సంతోషకరమన్నారు. కవుల రచనలు సమాజాన్ని చైతన్యవంతం చేయాలని పేర్కొన్నారు. పద్మశాలి అభ్యున్నతి కోసం తమ రచనలు కొనసాగించాలని సూచించారు.

కార్యక్రమంలో తెలుగు సాహితీ పీఠం జాతీయ అధ్యక్షుడు నలవోలు నరసింహారెడ్డి, నిజాం కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ తడక యాదగిరి, పద్య కవి డాక్టర్ పాండాల మహేశ్వర్, కవయిత్రి రాపోలు అరుణస్వామి, త్రివేణి సాహితీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గుంటి దయానంద్, గజ్జెల రామకృష్ణ, ప్రతినిధులు దోర్నాల కృష్ణ పంతులు, దోర్నాల శేషగిరి, కొండల్, సత్యనారాయణ పాల్గొన్నారు.

జన్మభూమి రుణం తీర్చుకోలేనిది : డాక్టర్ ఇమాన్యుయేల్

కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రామన్నపేట, జూలై 21 : జన్మభూమి రుణం తీర్చుకోలేనిదని ప్రముఖ వైద్యుడు డాక్టర్ ఇమాన్యుయేల్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన డాక్టర్ ఇమాన్యుయేల్ నలగొండ రోహిత్ దవాఖాన సహకారంతో ఆదివారం రామన్నపేటలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు చెవి, గొంతు, ముక్కు, కంటి పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా వీడియో ఎండోస్కోపీ, ఆడియో మీటర్ పరీక్షలతోపాటు మందులు, కండ్లద్దాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాను తరుచూ వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నానన్నారు. కార్యక్రమంలో వైద్యులు నితిషా, రోహిత్, మేనేజర్ ఎం.రాజకాంత, అబ్రహం కుమార్, జేఎస్ మార్టిన్, రేపాల ప్రకాశ్‌గుప్తా పాల్గొన్నారు.

కాటేపల్లి బ్రిడ్జిపై గుంతలు

కాటేపల్లి బ్రిడ్జిపై ఏర్పడిన గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

ఆత్మకూరు(ఎం), జూలై 21 : మోత్కూరు - భువనగిరి ప్రధాన రహదారి వెంట ఉన్న కాటేపల్లి బ్రిడ్జిపై మట్టి రోడ్డు గుంతలమయమైంది. ఈ క్రమంలో మూడ్రోజులుగా కురుస్తున్న వర్షంతో గుంతల్లో నీరు చేరి బురదమయంగా మారింది. దాంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి బ్రిడ్జిపై సీసీ నిర్మాణం చేపట్టి సమస్యను పరిష్కరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

జర్నలిస్టులకు కంటి పరీక్షలు

భువనగిరి అర్బన్, జూలై 21 : పట్టణంలోని సుమంత్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం జర్నలిస్టులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులకు కంటి పరీక్షలు నిర్వహించి కండ్లద్దాలు, మందులు అందజేశారు. అనంతరం టీజేయూ జిల్లా అధ్యక్షుడు షానూర్‌బాబా మాట్లాడుతూ జర్నలిస్టులు కంటి వ్యాధుల పట్ల నిర్లక్ష్యం చేయరాదని, వైద్యులను సంప్రదించి తగు సూచనలు పాటించాలని, అద్దాలను ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీజేయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపరాజు వెంకన్న, జర్నలిస్టులు లావణ్య, చంద్రకళరెడ్డి, అంబిక, షేక్ రషీద్, మల్లేశ్, నవీన్‌గౌడ్ పాల్గొన్నారు.

రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలి

ఆలేరు రూరల్/ ఆత్మకూరు(ఎం), జూలై 21 : కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులు రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏఓ దీప్తి, ఏఈఓ మనీషా ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో సూచించారు. 2024 జూన్ 28వరకు ధరణి పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్న రైతులు, ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు పొందిన 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు వారు అర్హులని తెలిపారు. ఇంతకు ముందు నమోదు చేసుకోని రైతులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తు ఫారానికి పట్టాదారు పాస్‌బుక్, ఆధార్, నామినీ ఆధార్ జిరాక్స్ జత చేసి రైతువేదికల్లో ఉన్న ఏఈఓలకు ఆగస్టు 5లోపు స్వయంగా అందించాలని సూచించారు. గతంలో బీమా చేసుకున్న రైతులు మార్పులు, చేర్పులతోపాటు నామినీ మార్పు కోసం ఈ నెల 30 వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

బొమ్మలరామారం, జూలై 21 : మండలంలోని చీకటిమామిడిలో ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ రాఘవేందర్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. చీకటిమామిడి గ్రామానికి చెందిన నవీన్‌కుమార్ (32) హెయిర్ సెలూన్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా అనారోగ్యానికి గురైన ఆయన హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆరోగ్యం బాగు కాకపోవడంతో మానసిక ఒత్తిడికి గురై జీవితంపై విరక్తితో ఆదివారం తెల్లవారుజామున తన ఇంట్లో చీరెతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య కడారి భాగ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్థిక సాయం

భువనగిరి అర్బన్, జూలై 21 : పట్టణంలోని ఎల్బీనగర్ కాలనీకి చెందిన జెర్రిపోతుల మల్లేశ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ అందజేసిన లక్ష రూపాయల చెక్కును మల్లేశ్ కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ నాయకులు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పోత్నక్ ప్రమోద్‌కుమార్, బర్రె జహంగీర్, పడగల ప్రదీప్, నరసింహ పాల్గొన్నారు.

అందోళ్‌మైసమ్మ ఆలయంలో వార్షికోత్సవ పూజల్లో పాల్గొన్న ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి

అందోళ్ మైసమ్మ ఆశీర్వాదంతో రైతులను ఆదుకున్నాం

● భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

చౌటుప్పల్ రూరల్, జూలై 21 : అందోళ్ మైసమ్మ అమ్మవారి ఆశీర్వాదంతో తమ ప్రభుత్వం రైతులను ఆదుకొని రుణమాఫీ చేసిందని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని దండుమల్కాపురం గ్రామంలో గల అందోళ్ మైసమ్మ దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో రెండో రోజు ఆదివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు శివసత్తుల విన్యాసాల నడుమ ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

జామచెట్లబావిలో బుచ్చమ్మ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్

పలువురికి మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ పరామర్శ

మోత్కూరు, జూలై 21 : రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు రుద్రపల్లి గణేశ్‌ను తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ ఆదివారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని ఆర్థిక సాయం అందించారు. జామచెట్ల బావి గ్రామంలో ఇటీవల మృతిచెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు పసుల ఫక్కీరు, బట్టు బుచ్చమ్మ చిత్రపటాలకు నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ప్రముఖ రచయిత అభినయ శ్రీనివాస్ తండ్రి దొంతోజు బ్రహ్మచారి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కార్యక్రమాల్లో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు కొణతం యాకూబ్ రెడ్డి, చిప్పలపల్లి మహేంద్రనాథ్, బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు పొన్నెబోయిన రమేశ్, జంగ శ్రీను, నార్మాక్స్ డైరెక్టర్ రచ్చ లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు మల్లేశ్, మల్లయ్య, శైలజ, రమేశ్, పరమేశ్ పాల్గొన్నారు.

పౌరాణిక నాటకం గురువులకు సన్మానం

పౌరాణిక నాటకం గురువులను సన్మానిస్తున్న రామలింగేశ్వరస్వామి నాట్యకళామండలి కళాకారులు

ఆత్మకూరు(ఎం), జూలై 21 : గురుపౌర్ణమి సందర్భంగా మండల కేంద్రంలో రామలింగేశ్వరస్వామి నాట్యకళామండలి ఆధ్వర్యంలో పౌరాణిక నాటకం గురువులు వెంకటరమణ, పరకాల నర్సయ్యను ఆదివారం సన్మానించారు. కార్యక్రమంలో నాట్యకళామండలి అధ్యక్షుడు పైళ్ల దామోదర్‌రెడ్డి, రామలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ ఐలయ్యగౌడ్, కళాకారులు గుండెగాని సత్తయ్య, నర్సయ్య, రవి, నర్సింహాచారి, సత్యనారాయణ, రాజు పాల్గొన్నారు.

బహర్‌పేటలోని పోచమ్మ దేవాలయంలో బోనాలను సమర్పించేందుకు వస్తున్న భక్తులు

భువనగిరిలో ఘనంగా బోనాలు

భువనగిరి అర్బన్, జూలై 21 : పట్టణంలోని బహర్‌పేట్ కాలనీలో ఆదివారం ఘనంగా బోనాల పండుగ జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ప్రజలు డప్పు వాయిద్యాలు, గొల్ల కురుమల డోలు చప్పుళ్లు, శివసత్తుల పూనకాల నడుమ బోనాలతో ఊరేగింపుగా పోచమ్మ దేవాలయానికి చేరుకున్నారు. ఆలయం వద్ద ప్రధాన పూజారి పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారికి బోనాలు, కానుకలు సమర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పోత్నక్ ప్రమోద్ కుమార్, ఈరపాక నరసింహ, పడిగెల రేణుకాప్రదీప్, నాయకులు జహంగీర్, హరిప్రసాద్, నాగరాజు, విజేందర్, శ్రీకాంత్, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

భూదాన్ పోచంపల్లి : దేశ్‌ముఖి సాయి బృందావనంలో పూజలు చేస్తున్న భక్తులు

ఆలేరు రూరల్, జూలై 21 : గురుపౌర్ణమిని పురస్కరించుకొని మండలంలోని సాయిబాబా ఆలయాల్లో ఆదివారం ఉదయం నుంచే కాగడా హారతి, పంచామృతంతో అభిషేకం చేశారు. నూతన వస్త్రాలంకరణ, సాయి సత్యవ్రతం, మధ్యాహ్నం హారతితో పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. కొలనుపాక సాయిబాబా ఆలయంలో భీమగోని సంతోష్‌గౌడ్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంలోని సాయిబాబా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున ఆలయంలో పంచామృతాలతో అభిషేకాలు, అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామానికి చెందిన జక్క శివారెడ్డి అన్నదానం ఏర్పాటు చేశారు. మాజీ సర్పంచ్ నగేశ్, పూజారి చంద్రశేఖరశర్మ పాల్గొన్నారు.

భూదాన్ పోచంపల్లి : మండలంలోని దేశ్‌ముఖి సాయి బృందావనం, పోచంపల్లి భక్తాంజనేయస్వామి, మార్కండేశ్వరస్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. యజ్ఞం, లక్ష పుష్పార్చన, సహస్రనామార్చన, అభిషేకాలు, అఖండ హారతి, అన్న ప్రసాదం, స్వామివారి ఊరేగింపు కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ గంట నారాయణస్వామీజీ, దేవాలయ కమిటీ చైర్మన్లు కడవేరు వెంకటేశం, బడుగు చండికేశ్వర్, కౌన్సిలర్ బోగ భానుమతి, ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

సాయిధామం ఆశ్రమంలో..

బొమ్మలరామారం : మండలంలోని పెద్ద పర్వతాపూర్ గ్రామంలో గల సాయిధామం ఆశ్రమంలో సాయిధామం పీఠాధిపతి రామానంద ప్రభూజీ ఆధ్వర్యంలో గురుపూర్ణిమోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయినాథ, దత్తాత్రేయ స్వాముల విగ్రహాలకు క్షీరాభిషేకం, అష్టోత్తర శతనామ పూజ, లక్ష పూజార్చన, హారతి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తుల సమావేశంలో రామానంద ప్రభూజీ మాట్లాడుతూ గురువును మించిన దైవం లేదన్నారు. గురు పరంపరగా విద్యను నేర్చుకొనే విధానం మన దేశంలో ప్రాచీన కాలం నుంచి ఉన్నదని తెలిపారు. గురువు సమాజాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి నిరంతరం కృషి చేస్తాడని పేర్కొన్నారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సాయిబాబా ఆలయంలో పూజలు చేశారు.

ఆత్మకూరు(ఎం) సాయిబాబా దేవాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



బొమ్మలరామారం : సాయిధామం ఆశ్రమంలో అనుగ్రహ భాషణం చేస్తున్న సాయిదత్త పీఠాధిపతి రామానంద ప్రభూజీ